క్లుప్తంగా

ధాన్యం రైతుల్లో ఆందోళన



నందిగామ: నందిగామ ప్రాంతంలో రెండు రోజులుగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు చిరుజల్లులు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ అధికారులు వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో దాల్వా సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గంలో 3,165ఎకరాల్లో రైతులు దాల్వా వరిపంట సాగు చేశారు.ప్రస్తుతం పలుచోట్ల కోతలు పూర్తికాగా మరికొన్నిచోట్ల రైతులు హడావిడిగా మిషన్ల ద్వారా కోతలు చేపట్టారు. వరికోతలు పూర్తిచేసుకున్న రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు పట్టలు కప్పి భద్రపరుచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సచివాలయం పరిశీలన

జయంతి(వీరులపాడు): గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివపార్వతీ ఆదేశించారు. మండలంలోని జయంతి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ముఖ్యంగా ఆయా సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలతో సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉద్యోగుల పని తీరు, సచివాలయంలో అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోదాడ రోడ్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద వాహనాల పార్కింగ్ సమస్య తీవ్రంగా మారింది. ప్రధాన రోడ్డు కావడంతో ఈ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల కోసం బ్యాంకు సిబ్బంది పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయక పోవడంతో ఖాతాదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయని పట్టణ ప్రజలు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్ద శివాలయం వీధిలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం రాత్రి పట్టణ వీధుల్లో స్వామివారి రథోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది.

మాగల్లులో పోలీసు కవాతు



నందిగామ: గ్రామాల్లో అనవసరంగా ప్రజలు వివాదాలకుపోయి ఇబ్బందులు పడవద్దని నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. ఎన్నికల పోలింగ్ అనంతరం రాష్ట్రంలో పలుచోట్ల వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి మండలంలోని మాగల్లు, కొండూరు గ్రామాల్లో ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందున ప్రజలు ఎక్కడా గుమ్మి కూడి ఉండకూడదన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. పోలీసు కవాతులో ఎస్‌ఐలు దుర్గామహేశ్వరరావు, పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్‌లో పెరిగిన పోలింగ్ శాతం

- గ్రామాల్లో అధికశాతం పోలింగ్ నమోదు
- పట్టణాల కంటే సరాసరి 9శాతం అధికం
- గ్రామీణ ఓటర్లలో పెరిగిన చైతన్యం
- అధిక పోలింగ్‌పై టీడీపీలో గుబులు



నందిగామ మండలం అంబారుపేట పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

నందిగామ టౌన్ /జగ్గయ్యపేట అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ ఓటర్లు అధికశాతం మంది ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యస్ఫూర్తిని ప్రదర్శించారు. నందిగామ, జగ్గయ్యపేట పట్టణాల కంటే ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆయా మండలాల్లోనే అధికశాతం పోలింగ్ నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05 480మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,79,915 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 87.56శాతం పోలింగ్ నమోదైంది. ఓటేసిన వారిలో పురుషులు 87,768మంది ఉండగా, మహిళలు 92,143మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. పురుషుల కంటే అధికంగా 4,375 మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక నియోజకవర్గంలోని నందిగామ పట్టణ ఓటర్లతో పోల్చితే మండలాల్లోని గ్రామీణ ఓటర్లే అధికశాతం మంది ఓటింగ్‌లో పాల్గొని తమ చైతన్యాన్ని చాటిచెప్పారు. నందిగామ పట్టణంలో మొత్తం 36,492మంది ఓటర్లు ఉండగా, వీరిలో 29,092మంది ఓటు వేశారు. పోలింగ్ శాతం 79.72గా నమోదైంది. అయితే నందిగామ పట్టణ ఓటర్ల పోలింగ్ శాతం కంటే నందిగామ రూరల్ మండలం, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల పోలింగ్‌శాతం అధికంగా నమోదుకావడం గమనార్హం. నందిగామ రూరల్ మండలంలో 23,489 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 21,420మంది ఓటర్లు ఓటు వేశారు. పోలింగ్‌శాతం 91.19శాతం నమోదైంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నందిగామ మండలంలోనే అధికశాతం పోలింగ్ నమోదైంది. చందర్లపాడు మండలంలో మొత్తం 49,019ఓట్లు ఉండగా, వీరిలో 43,668 (89.08శాతం)మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కంచికచర్ల మండలంలో 56,066మంది ఓటర్లు ఉండగా, 49,488 (88.27శాతం)మంది ఓటు వేశారు. వీరులపాడు మండలంలో 40,414 మంది ఓటర్లు ఉండగా, 36,247 (89.69శాతం) మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇలా నందిగామ పట్టణంతో పోల్చితే మిగిలిన అన్ని రూరల్ మండలాల్లో 9నుంచి 11శాతం వరకు పోలింగ్‌శాతం పెరిగిందని చెప్పవచ్చు.

జగ్గయ్యపేటలోనూ అదే పరిస్థితి..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 2,05,364 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,84,575మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం 89.88గా నమోదైంది. ఓటేసిన వారిలో 88,667మంది పురుషులు ఉండగా, 95,905 మంది మహిళలు, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 7,237మంది అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. జగ్గయ్యపేట మండలంలో మొత్తం ఓటర్లు 57,029మంది ఉండగా, వీరిలో 51,988 (91.16శాతం) మంది ఓటేశారు. జగ్గయ్యపేట పట్టణంలో 41,082 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 35,129 (85.51శాతం) మంది ఓటేశారు. పెనుగంచిప్రోలు మండలంలో 41,815మంది ఓటర్లు ఉండగా, 37,967 (90.80శాతం)మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వత్సవాయి మండలంలో 50,017మంది ఓటరు ఉండగా, 45,105 (90.18శాతం)మంది ఓటు వేశారు. నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలంలోగల ఏటిపట్టు గ్రామాల్లో 15,421మంది ఓటర్లు ఉండగా, వీరిలో 14,386 (93.29శాతం) మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇలా నియోజకవర్గ పరిధిలోని అన్ని రూరల్ మండలాల్లో 90శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, జగ్గయ్యపేట పట్టణంలో మాత్రం 85.51శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. పట్టణ ఓటర్లతో పోల్చితే ఐదు నుంచి ఎనిమిది శాతం అధికంగా రూరల్ మండల ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని పోలింగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పట్టణ ఓటర్లతో పోల్చితే రూరల్ గ్రామాల ఓటర్లు ఎంతో ఓపిగ్గా క్యూలైన్లలో నిలబడి ఓటేశారని చెప్పవచ్చు. పట్టణ వాసులు ఓటుహక్కు నమోదు చేసుకునేప్పుడు చూపించే ఉత్సాహం, పోలింగ్ రోజున ఓటు వేసే విషయంలో లేదని పోలింగ్ నమోదు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

టీడీపీ నాయకుల్లో గుబులు..

పట్టణ ప్రాంతాలతో పోల్చితే రూరల్ మండలాల్లో ఓటింగ్‌శాతం అధికంగా నమోదు కావడం టీడీపీ వర్గాల్లో గుబులు రేపుతోంది. గత ఎన్నికల్లోనూ రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ అధికంగా నమోదు కాగా, ఫలితాలు ఆపార్టీకి తీవ్ర నిరాశను మిగిల్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈసారి కూడా గ్రామాల్లోని ప్రజలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు వేచి ఉండి మరీ ఓటెయ్యడం తమకే లాభిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపుతుండటంతోపాటు జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలతో పోల్చితే ఆయా మండలాల్లో ఎనిమిది నుంచి పదిశాతం అధికంగా పోలింగ్ నమోదుకావడంతో తమకు ఓటమి తప్పేలా లేదని టీడీపీ నాయకులు మల్లగుల్లాలుపడుతున్నారు. ప్రస్తుత పోలింగ్ సరళిని గమనిస్తే ఈసారి కూడా అదే ఫలితాలు పునరావృతమయ్యేలా ఉన్నాయని టీడీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. గత ఎన్నికల్లోనూ రాష్ట్రంలో భారీ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం, ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ గెలుచుకున్న 23సీట్లలో దాదాపు పది స్థానాలు అంటే 45శాతం సీట్లు అర్బన్ ప్రాంతానికే చెందినవి కావడంతో గ్రామీణ ఓటర్లు ఈసారి కూడా వైఎస్సార్ సీపీకే పట్టం కట్టనున్నారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

‘కలేకూరి’కి ఘననివాళి



కంచికచర్ల : కవి, గేయ రచయిత, ఉద్యమకారుడు, అనువాదకుడు కలేకూరి ప్రసాద్ 11వ వర్ధంతిని శుక్రవారం కంచికచర్లలో నిర్వహించారు. కంచికచర్లలోని ఆయన సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రముఖ రచయిత తంగిరాల సోనీ మాట్లాడుతూ కలేకూరి జీవితం దళిత ఉద్యమాలకు, సాహిత్యం పీడితుల పక్షంగా ఉన్నాయన్నారు. ఆయన జీవితమంతా ఉద్యమం, సమాజమంటూ బహుజనుల మానవ సమానత్వం, స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడారన్నాఉ. నేటికి ప్రజల గుండెల్లో ప్రజాకవిగా కలేకూరి ముద్ర వేసుకున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేల్పుల రమేష్ తంగిరాల సృజనీకుమార్, చట్టి రవీంద్ర, దగ్గుపాటి మనోహర్, తన్నీరు శ్రీనివాసరావు, బీ శంకరరావు, కర్ల రవికుమార్, బెజ్జం భూషణం, చట్టి రవీంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందని ఆర్డీవో ఎ.రవీంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం నుంచి జూన్ 17 వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆర్డీవో వివరించారు. అదేవిధంగా నందిగామలో పోలీసు యాక్ట్ అమలులో ఉందని ఇన్‌స్పెక్టర్ హనీష్ మరో ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు చేయడం నిషిద్ధమని వారు పేర్కొన్నారు.

ఎన్నికలకు ముందు..తర్వాత ప్రజల్లోనే

వీరులపాడు: ఎన్నికలకు ముందు ప్రజలతోనే.. ఎన్నికల తర్వాత ప్రజల్లోనే.. ఇది నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తీరు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శుక్రవారం వీరులపాడు మండలంలోని జగన్నాథపురం, నరసింహారావుపాలెం, పెద్దాపురం, జయంతి, గూడెంమాధవరం గ్రామాలను సందర్శించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరూ శక్తివంచన లేకుండా కృషిచేశారంటూ వారిని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. నందిగామలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు షేక్ నాగుల్‌మీరా, కోటేరు సూర్యనారాయణ రెడ్డి, బండి మురళి, మారపాక మహాలక్ష్మి, ఇప్పల సత్యనారాయణరెడ్డి, జంగా కోటిరెడ్డి, సాంబిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జుజ్జూరులో నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నిశాఖల అధికారులతో నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 25వతేదీ వరకు నిర్వహించే కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈనెల 22న అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో చలువ పందిళ్లు, టెంట్‌లు, మజ్జిగ, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో నీరు తక్కువగా ఉండటంతో నీటిపారుదల శాఖాధికారులు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాటుకు సమీపంలోని స్థలాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఈ ప్రాంతంలోని కర్మాగార యాజమాన్యాలు కూడా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. గతేడాది ఉత్సవాల సందర్భంగా భక్తులకు కలిగిన అసౌకర్యాన్ని విలేకరులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లగా, ఈసారి అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తామని వివరించారు. అనంతరం తిరుకల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆర్డీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హేమలతాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సీఐ జానకిరామ్, సర్పంచి గుడారు పేరయ్య, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఫైర్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిరు కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు, అధికారులు

నేత్రపర్వం.. పాండురంగడి పుష్పయాగం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్త గుళ్ల ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి పుష్పయాగం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం ద్వాదశ వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగడి ఉత్సవ మూర్తులకు తిరుమంజనం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమాలను అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీ కృష్ణమాచార్యులు నిర్వహించారు.

ద్విచక్ర వాహనం చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట బెజ్జాలమేడ ప్రాంతంలో పైడమర్రి వేణుగోపాలరావు కుటుంబం నివసిస్తోంది. ఇతను సూర్యారావుపేటలో మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు.కొద్దిరోజుల క్రితం వేణుగోపాలరావు తనమేనల్లుడు విజయ్‌కుమార్ వద్ద బైక్ తీసుకుని వాడుకుంటున్నాడు. ఈ నెల 9వతేదీ రాత్రి ఇంటిముందు పెట్టిన వాహనం మరుసటిరోజు ఉదయం చూసే సరికి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీకి ఘనవిజయం తథ్యం

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించనుందని, రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ప్రభుత్వ విప్, ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేటలో తన గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. నియోజకవర్గవ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉదయభానును కలిసేందుకు శుక్రవారం జగ్గయ్యపేటలోని ఆయన నివాసానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా విప్ సామినేని ఉదయభాను ఈఎన్నికల్లో తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ జరిగిన విధానం, పోలింగ్ నమోదు శాతం తదితర అంశాలపై ఆయా గ్రామాల నాయకులను అడుగగా, తమ గ్రామాల్లో మెజార్టీ ఓట్లు వైఎస్సార్ సీపీకే వస్తాయని వారు వివరించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ పేదలు, పెత్తందార్లకు మధ్య జరిగిన ఈ ఎన్నికల యుద్ధంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో సీఎం జగన్ మరొకసారి తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారన్నారు. గతంలో వచ్చిన సీట్ల కంటే రాష్ట్రంలో ఎక్కువ సీట్లు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేయడాన్ని గుర్తుచేశారు. పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌లో అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



తనను కలిసేందుకు వచ్చిన బలుసుపాడు నాయకులు, కార్యకర్తలతో విప్ ఉదయభాను

అక్రమ కట్టడాల తొలగింపు

నందిగామ: పట్టణ పరిధిలో అక్రమ కట్టడాలు, లేఅవుట్లను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణ పరిధిలో నిర్మిస్తున్న పలు అక్రమ కట్టడాలను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అనుమతుల మేరకే నిర్మాణాలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు జరిపినా, అనధికారిక లే అవుట్‌లు వేసినా వాటిని తొలగించడంతో పాటు నిర్మాణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనవసరంగా అక్రమ కట్టడాల నిర్మాణాలు చేసి నష్టపోవద్దని సూచించారు. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని, అయినా కొందరు అక్రమ కట్టడాలు చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది ద్వారా ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు ఆయా అనధికారిక, అక్రమ కట్టణాలను తొలగిస్తామని కమిషనర్ వివరించారు. అక్రమ కట్టణాల తొలగింపులో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారుల సహకారంతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సందడి చేస్తున్న విదేశీ విహంగాలు

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని వెంకటాపురం గ్రామానికి ఏటా వేల కిలోమీటర్లు ప్రయాణించి ఆస్ట్రేలియా నుంచి పెయింటెడ్ స్టార్క్స్(ఎర్రకాళ్ల కొంగలు) డిసెంబర్‌లో వచ్చి విడిది చేస్తాయి. వందల సంఖ్యలో వచ్చిన పక్షులు సంతానోత్పత్తి తరువాత జూన్‌లో వాటి స్వస్థలాలకు వెళ్తుంటాయి. గ్రామస్తులు కూడా వీటిని తమ సొంత బిడ్డల్లా చూసుకుంటారు.

పక్షుల కోలాహలం..

వెంకటాపురం గ్రామంలో ఎక్కడ చూసినా పక్షుల కోలాహలం కనపడుతోంది. వందల సంఖ్యలో వచ్చిన పక్షులు నేడు సంతానోత్పత్తి ద్వారా వేల సంఖ్యకు చేరాయి. ఇవి చేసే అరుపులు, ధ్వనులతో ఆప్రాంతం సందడిగా మారింది,

ఈ విదేశీ పక్షులు గ్రామంలో కలియగిరుతూ అందరితో కలిసి పోతున్నాయి. ఇళ్ల మీద, ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ సందడి చేస్తున్నాయి.

పక్షులకు కలిసి వస్తున్న నీటి వనరులు..

పక్షులు ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులతో గతంలో అనేకం మృత్యువాత పడేవి. కుంటల్లో, చెరువుల్లో, పక్కనే ఉన్న మునేరులో కూడా నీరులేక ఆహారం కూడ దొరకక అనేక ఇబ్బందులు పడేవి. అయితే రెండు మూడేళ్లుగా మునేరులో, నీటి కుంటలో, చెరువులు, వాగుల్లో కూడా నీరు పుష్కలంగా ఉండటంతో పక్షుల ఆవాసానికి వాతావరణం ఉపయోగకరంగా మారింది. ఈఏడాది మునేరులో నీరు లేకపోవడంతో పక్షులకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి.

నీటికుంట అభివృద్ధి చేస్తే..

దశాబ్దాల నుంచి తమ గ్రామానికి బంధువుల మాదిరిగా ఏటా వస్తున్న పక్షులను తమ సొంత బిడ్డల్లాగా చూసుకుంటున్నారు. గ్రామంలోని నీటి కుంట ఈ పక్షులు తాగునీటి అవసరాన్ని తీరుస్తోంది. ఎకరం 80 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈకుంటను ఊర చెరువుగా అభివృద్ధి చేస్తే పక్షులకు తాగునీటి ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామంలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. కుంటలో వర్షపు నీరు రాకపోయినా మునేరు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని నింపవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వెంకటాపురంలోని కుంటలో సంచరిస్తున్న విదేశీ పక్షులు



గ్రామంలోని చెట్లపై ఉన్న విదేశీ పక్షులు

పక్షుల రక్షణకు చర్యలు చేపడతాం..



గ్రామంలో విదేశీ పక్షుల రక్షణకు చర్యలు చేపడతాం. గ్రామస్తులు వీటిని తమ సొంత బిడ్డల్లా చూసుకోవటం ముచ్చటేస్తుంది. ప్రస్తుతం గ్రామంలో వేల సంఖ్యలో పక్షులు సందడి చేస్తున్నాయి. పక్షుల తాగునీటికి అవసరమైన నీటికుంట అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. కుంటను ఊర చెరువుగా అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు కూడా సహకరించాలి.

– కూచి నర్సయ్య, సర్పంచి

అక్రమ కేసులు బనాయించడం సరికాదు

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ముగిసిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దురుద్దేశ పూర్వకంగా అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా లీగల్ సెల్ ప్రతినిధులు కోటమరాజు వెంకటేష్‌శర్మ, చెంగవల్లి సాయిరాం, అబ్రహంలింకన్, బసవరెడ్డి సత్యనారాయణరెడ్డి, అబ్దుల్‌రజాక్, ఒగ్గు గవాస్కర్ అన్నారు. నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్‌కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణను వారు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో వివాదాలకు కేంద్ర బిందువైన బొండా ఉమా కుమారులపై ఎన్నికల ముందు పోలీసులు కేసులు నమోదు చేశారన్నారని తెలిపారు. దీనికి కౌంటర్‌గా బొండా ఉమా కుమారులు పెట్టిన కేసుల్లో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థులను ఇరికించి, వారిని తీసుకెళ్లి పోలీసులు ఇబ్బందులు గురిచేయడం హేయమైన చర్య అన్నారు.. భవానీపురంలో ఎన్నికలు జరుగుతున్న రోజు అక్కడ లేని వ్యక్తులపై కేసులు నమోదు చేసి పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బూత్ వద్ద సీసీ పుటేజీలను పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయని సూచించారు. ఎలాంటి కేసులు లేని సామాన్యులపైనా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారని సీపీ దృష్టికి తీసుకెళ్లారు.

